క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రొద్దుటూరు : మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు ఫీడర్ మినహా, 33కేవీ, 11 కేవీ ఫీడర్లలో ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ పనుల కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

16 నుంచి ధనుర్మాస పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 5.30 గంటలకు తిరుప్పావై పాశురాల పఠనం , తెలుగు పండితుడు అందలం మద్దిలేటయ్య ఆధ్వర్యంలో పురాణపఠనం చేయనున్నారు. అలాగే జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, 11వ తేదీన ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, 6 గంటలకు 108 మట్టికుండల్లో శ్రీకృష్ణునికి పాయసాన్న నివేదన, 13వ తేదీన ఉదయం 10.30 గంటలకు గోదాదేవి శ్రీకృష్ణుల కల్యాణోత్సవం, రాత్రి 8గంటకు పాన్పు సేవ చేయనున్నారు. కార్యక్రమంలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ట్రస్ట్ కమిటీ వారు కోరారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రసాదరెడ్డి తదితరులు

పోరుమామిళ్ల: క్రిస్మస్ సందర్భంగా వృద్ధులకు చిత్తా శౌరిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఎఫ్‌సీఎస్ సహకారంతో టేకూరుపేట, చెన్నారెడ్డిపల్లె ఆర్‌సీఎం చర్చిల పరిధిల్లోని వివిధ గ్రామాల వృద్ధులకు దుస్తులు అందజేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు పంపిన దుస్తులు వృద్ధులకు పంపిణీ చేశామని సంస్థ ప్రతినిధులు ప్రసాదరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రోడ్లు, కాలువలు నిర్మిస్తాం


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలో ప్రజల కోరిక మేరకు రోడ్లు, కాలువలను నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం వార్డు పర్యటనలో భాగంగా కమిషనర్‌ను మున్సిపాలిటీ పరిధిలోని బుడ్డాయపల్లె రోడ్లు, కాలువలు నిర్మించాలని ప్రజలు కోరారు. ఆయన ఇందుకు సంబంధించిన అంచనాలను తయారు చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. చెత్త సేకరణ, మంచినీటి సరఫరా, వీధి దీపాల సమస్యలపై ప్రజలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. శివాలయం సెంటర్‌లోని పాత తృప్తి బేకరి వద్ద ఉన్న చెత్త పాయింట్‌ను పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, ఒకటో వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి


ఓబయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల పంచాయతీ రామాయపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అల్లూరి ఓబయ్య శుక్రవారం మృతి చెందారు. సమాచారం తెలిసిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి రామాయపల్లె వెళ్లి ఓబయ్య మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ ఇస్సాక్, మాజీ సర్పంచ్ జేకే, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, పంచాయతీ నాయకులు ఓబయ్య, కొండయ్య, శివయ్య, సాయినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నవరంలో రెవెన్యూ సదస్సు

చాపాడు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు రమాకుమారి కోరారు. మండల పరిధిలోని అన్నవరం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. రైతులు ఇచ్చే ప్రతి ఫిర్యాదుకు రసీదులు ఇస్తున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పంటల బీమాతో ధీమా

- బీమాకు ఎసరుపెట్టిన 'కూటమి'
- రైతులపై భారం


వర్షానికి పడిపోయిన వరి పంట

ప్రొద్దుటూరు రూరల్ : రైతులపై ప్రీమియం భారం పడకుండా 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఈ–క్రాప్ నమోదు ప్రమాణికంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా వర్తించడంతో పంటల నష్టం వాటిల్లితే రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందేది. అయితే ఉచిత పంటల బీమా పథకానికి కూటమి ప్రభుత్వం ఎసరు పెట్టింది. రబీ సీజన్‌లో రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని నిర్ణయించింది. రైతుకు ఎకరాకు పంట విలువ రూ. 41,000లో ప్రీమియంగా రెండు శాతం మొత్తం రూ.820 బీమా కంపెనీకి చెల్లించాల్సి ఉంది. దీనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 0.5 శాతం వాటా అంటే రూ.205 మినహాయిస్తే మిగిలిన 1.5 శాతం మేర రూ. 615 రైతులే చెల్లించాలి.

రేపటితో ముగియనున్న గడువు

రబీ సీజన్‌లో సాగవుతున్న 8 పంటలలోని 7 పంటలకు ఆదివారం నాటికి బీమా ప్రీమియం చెల్లింపునకు ఆఖరి రోజు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద నువ్వులు, వేరుశనగ, పెసలు, జొన్నలు, మినుము, వరి, పొద్దుతిరుగుడు, శనగ పంటలకు ప్రీమియం చెల్లింపునకు ఎంపిక చేశారు. ఈ బీమా ప్రీమియం చెల్లింపు వలన ప్రకృతి వైపరీత్యాలతో ఆయా పంటలు నష్టపోతే వీటికి పరిహారం అందుతుంది. ఈ 8 రకాల పంటలలో వరికి మినహా మిగిలిన ఏడు పంటలకు ప్రీమియం చెల్లించడానికి ఆదివారం చివరి రోజు. వరికి మాత్రం ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉంది. నువ్వులు ఎకరాకు రూ.180 చెల్లిస్తే రూ.12 వేలు పంట నష్ట బీమా అందుతుంది. అలాగే వేరుశనగ ఎకరాకు రూ.480 చెల్లిస్తే రూ.32 వేలు, పెసలు రూ.270 చెల్లిస్తే రూ.18వేలు, జొన్నలు రూ.315 చెల్లిస్తే రూ.21వేలు, మినుము రూ.285 చెల్లిస్తే రూ.19 వేలు, వరికి రూ.630 చెల్లిస్తే రూ.42వేలు, పొద్దుతిరుగుడు రూ.300 చెల్లిస్తే రూ.27వేలు, శనగలు రూ.420 చెల్లిస్తే రూ.32 వేలు రైతులకు పంట నష్టపరిహారం అందుతుంది.

అందుబాటులో ఉంటాం



పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు చివరి రోజు ఆదివారం కావడంతో ఆ రోజు కూడా రైతులు మమ్మల్ని సంప్రదించవచ్చు. పంటల బీమా నమోదుకు కావాల్సిన క్రాప్ బుకింగ్ సర్టిఫికెట్లను శని, ఆదివారాల్లో అందుబాటులో ఉండి రైతులకు అందిస్తాం. బొల్లవరం, పెద్దశెట్టిపల్లె గ్రామ పంచాయతీల్లో సాంకేతిక లోపం వలన క్రాప్ బుకింగ్ కావడం లేదు. ప్రస్తుతం ఆ సమస్యను పరిష్కరించాం. రైతులు గడువులోపు ప్రీమియం చెల్లించి బీమాను పొందాలి.

–మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి

అవగాహన కల్పించాలి



అధికారులు అవగాహన కల్పించలేకపోవడం వలన కొంత మంది రైతులే బీమాను ఉపయోగించుకుంటున్నారు. ప్రతి ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంట నష్టం జరుగుతూనే ఉంది. నేను ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలను సాగు చేస్తున్నాను. కానీ ఒక సారి కూడా ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని వినియోగించుకోలేకపోయాను. ప్రీమియం చెల్లించే విధానం నాకు తెలియకపోవడం వలన దరఖాస్తు చేసుకోలేదు. రైతులకు బీమా గురించి అధికారులు అవగాహన కల్పించాలి.

– పందిటి నారాయణ, చిన్నవరదాయపల్లె, చాపాడు మండలం

అకాల కష్టం..!


వడ్లపై పట్టలు కప్పిన రైతులు


వడ్లను ఆరబెట్టుకుంటున్న రైతులు

చాపాడు: ఆరుగాలం కష్టపడి పంటను పండించిన రైతన్న దానిని దక్కించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. పంట చేతికందే సమయంలో తుపానుల ప్రభావంతో వర్షాలు పడుతుండటంతో ఓ వైపు పంటను కాపాడుకునేందుకు.. మరో వైపు నూర్పిడి చేసిన ధాన్యం దెబ్బతినకుండా రక్షించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. గత వారంలో ఫెంగల్ తుపాను వలన వరి పంటలు పడిపోవటం, ధాన్యపు రాశులు కల్లాల్లో తడిచిపోచాయి. ఫెంగల్ తుపాను ముగిసిందని ఊపిరిపీల్చుకున్న రైతులకు నాలుగు రోజులకే మళ్లీ తుపాను రావడంతో మూడు రోజులుగా వాతావరణం చల్లబడింది. ఈ క్రమంలో వర్షాలు పడుతూ ఆగుతూ ఉండడంతో ధాన్యపు రాశులను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నూర్పిడి దశలో ఉన్న పంటను నూర్పిడి చేసుకోలేకపోతున్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 28వేల ఎకరాలకు రైతులు వరి సాగు చేశారు. పంట దిగుబడులు బాగున్నప్పటికీ వర్షాలతో ఇబ్బందులు తలెత్తగా రోజు రోజుకు పడిపోతున్న ధరలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నూర్పిళ్ల ఆరంభంలో పుట్టి(8బస్తాలు) రూ.13వేల ఉండగా ప్రస్తుతం రూ.11వేలకు ధరలు తగ్గాయి. పంట నాణ్యతను బట్టి దళారులు మరింత తగ్గిస్తున్నారని రైతులు విచారణ వ్యక్తం చేస్తున్నారు.


విశ్వనాథపురంలో వర్షాలకు పడిపోయిన వరి పంట

నేడు నీటి సంఘం ఎన్నికలు


బొల్లవరం పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ గంగయ్య, మైలవరం ఏఈ లలితా రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి మైలవరం కెనాల్ పరిధిలో మూడు సంఘాలకు, కేసీ కెనాల్ పరిధిలో ఒక నీటి సంఘానికి శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను అధికారులు సర్వం సిద్ధం చేశారు. మైలవరం కెనాల్ బొల్లవరానికి సంబంధించి ఒక నీటి సంఘం పరిధిలో 523 ఓటర్లు, పెద్దశెట్టిపల్లె నీటి సంఘం పరిధిలో 1,175 మంది ఓటర్లు, ప్రొద్దుటూరు నీటి సంఘం పరిధిలో 594 మంది ఓటర్లు ఉన్నారు. కేసీ కెనాల్ పరిధిలోని ఉప్పరపల్లె నీటి సంఘం పరిధిలో 693 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహసీల్దార్ గంగయ్య, కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్‌రెడ్డి, మైలవరం ఏఈ లలితా రెడ్డి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ తెలిపారు.

ఏకపక్షంగా రెవెన్యూ అధికారులు

గోపవరం : నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని గోపవరం నీటి సంఘానికి సంబంధించి ఓటర్ల తుదిజాబితాను ఇవ్వాలని తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, వీఆర్‌ఓ జయరాములును స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అడిగినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోగా తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం ఓటరు జాబితా కోసం మరోసారి తహసీల్దారు వద్దకు వెళ్లగా జాబితా ఇవ్వడం జరిగిందని, అయితే సాయంత్రం మరో జాబితా బయటికి రావడంతో అనుమానం వచ్చి మరోసారి తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి వీఆర్‌ఓను అడుగగా తనకేమి తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు తెలిపారు. అయితే టీడీపీ నాయకులు అప్పటికప్పుడు నీటిపన్నులు చెల్లించి కొత్త పేర్లను జాబితాలో చేర్చడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారులను అడ్డుపెట్టుకుని ఏకపక్షంగా నీటి సంఘాల ఎన్నికలను జరుపుకోవాలని చూస్తుందని ఆయన ఆరోపించారు. అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుంపులు గుంపులుగా ఉండొద్దు

రాజుపాళెం : మండలంలో శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎక్కడేగాని గుంపులు, గుంపులుగా తిరగొద్దని రాజుపాళెం ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం 144 సెక్షన్ అమలులో ఉందని, గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే ఎవరైనా రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా, ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించి ఘర్షణలకు ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ప్రణీత్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ఎస్సీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న యంజర్ల ప్రణీత్‌రెడ్డి రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి 30వ తేదీన విజయవాడలో జరుగనున్న రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో పాల్గొననున్నాడు. విద్యార్థి తండ్రి సుధాకర్‌రెడ్డి 2వ వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు,ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సారూ.. న్యాయం చేయండి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న చెన్నమ్మ

ప్రొద్దుటూరు రూరల్ : తన ఆవులు, పాడి గేదెలను బంధించారని, అవి ఆకలితో అలమటిస్తున్నాయని నంగనూరుపల్లె గ్రామానికి చెందిన మేకల చెన్నమ్మ అనే వృద్ధురాలు శుక్రవారం తహసీల్దార్ గంగయ్యకు ఫిర్యాదు చేసింది. విచారించి న్యాయం చేయాలని వేడుకుంది. చెన్నమ్మ మాట్లాడుతూ ఆవులు, గేదెలకు నిర్మించుకున్న షెడ్‌కు రహదారి ఉందన్నారు. అయితే తన దాయాదులైన అర్జున్, వెంకటసుబ్బయ్య రహదారి లేదంటూ షెడ్డుకు అడ్డంగా బండలను పాతారని తెలిపారు. దీంతో ఆవులు, గేదెలు బయటికి రాలేక మేత, నీరు లేక ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 11న ఆకలితో ఒక ఆవు చనిపోయిందని వాపోయారు. ప్రశ్నించిన తనకు కుమారుడిని గాయపరిచారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె తహసీల్దార్‌కు మొరపెట్టుకుంది.

కమిషనర్‌కు సత్కారం

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డిని శుక్రవారం మొల్ల సాహితీ పీఠం ఆధ్వర్యంలో సేవా పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌గా నరసింహారెడ్డి బాధ్యతలు చేపట్టిన వంద రోజులలోనే పట్టణంలో చాలా రకాల సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. మొల్ల సాహితీపీఠం, భాగ్యరత్న ఫౌండేషన్ సభ్యులు పెంచలయ్య, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి


మైదుకూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు


రాజుపాళెం : మాట్లాడుతున్న డివిజనల్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం

మైదుకూరు : అందరి సహకారంతో మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. శుక్రవారం మండల సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన కింద శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ ఉద్యోగులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల వారి సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. 2030 నాటికి అలాగే 2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాలపై శిక్షణలో పాల్గొన్న వారికి సమగ్రమైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సుధాకర్, ఎంఈఓ సురేష్, రెడ్డయ్య, వెలుగు ఏపీఎం జయరాజ్, ఉపాధి ఏపీఓ రామచంద్రారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఓబుళమ్మ, శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు శిక్షణా శిబిరం

చాపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం రెండో రోజులు స్థానికరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి అధికార యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరకిషోర్, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు కృషి చేయాలి

రాజుపాళెం : సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనలో భాగంగా అన్ని రంగాలను అభివృద్ధి పరచడంలో గ్రామ పంచాయతీల ప్రణాళికను తయారు చేసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని డివిజనల్ అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రాజుపాళెం మండల పరిషత్ సభాభవనంలో శుక్రవారం సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 9 థీమ్‌ల ద్వారా గ్రామాల అభివృద్ధికి 2030 సంవత్సరంలోపు అన్ని లక్ష్యాలను సాధించాలన్నారు. ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఈ లక్ష్య సాధన అంశాలను అవగాహన చేసుకుని గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఈఓపీఆర్డీ షాకీర్‌అలీఖాన్, ఏపీఎం సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగ సంస్థలను పరిరక్షించుకుందాం

బద్వేలు అర్బన్ : విద్యుత్ రంగ సంస్థలను పరిరక్షించుకునేందుకు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. జాతీయ ప్రైవేటీకరణ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఏడీఈ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు 2022 పీఆర్సీ ఇవ్వాలని కోరారు. 2019 నుంచి పనిచేస్తున్న కార్మికులకు పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. విద్యుత్ సంస్థకు నష్టం కలిగించే పీపీఏ విధానాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 22న కడపలో జరిగే విద్యుత్ ఉద్యోగ, కార్మికుల ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

హామీలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

పోరుమామిళ్ల: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హామీలను విస్మరిస్తోందని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు వెంకటరమణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ విమర్శించారు. అర్హులకు 2 ఎకరాల భూమి, ఇంటిస్థలం ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఇప్పటివరకు ఆ హామీ అమలు చేయలేదని వారు పేర్కొన్నారు. ఈ నెల 16న ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా జయప్రదం చేయాలని కోరారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదలకు దక్కాల్సిన భూములు కబ్జాకు గురవుతున్నాయని వారు తెలిపారు.

బ్రహ్మంసాగర్ నీటిని వాడితే చర్యలు

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీ ప్రజలు తాగునీటి అవసరాల కోసం బృహత్తర తాగునీటి పథకం ద్వారా అందించే బ్రహ్మంసాగర్ నీటిని గృహ నిర్మాణాలకు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం ఎన్జీఓ కాలనీలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ పట్టణంలో చాలా వరకు ఇంటి నిర్మాణ పనులకు బ్రహ్మంసాగర్ నుంచి అందించే తాగునీటిని వినియోగిస్తున్నారని, దీని వలన తాగునీటి కొరత ఏర్పడుతుందని అన్నారు. అంతేకాకుండా బ్రహ్మంసాగర్ నుంచి అందించే తాగునీటిలో తగు మోతాదులో క్లోరిన్ ఉండటం వలన సదరు నీటిని స్లాబు క్యూరింగ్, ఇతర నిర్మాణ పనులకు వినియోగిస్తే నిర్మాణాలు త్వరగా పాడవుతాయని, ఈ విషయాన్ని ప్రజలకు నీటి సరఫరా చేసే సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.

బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం

పట్టణంలో బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా మార్కెట్‌కు వచ్చే వ్యాపారస్తులు, ప్రజలు పరిసర ప్రాంతాల్లో మలమూత్ర విసర్జన చేయడం వలన పర్యావరణం కలుషితం కావడమే కాక అపరిశుభ్రత వాతావరణం ఏర్పడుతోందని అన్నారు.

ఘనంగా హనుమద్ వ్రతం


ప్రత్యేక అలంకరణలో హనుమంతుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని దత్తపీఠంలోని కార్యసిద్ధి హనుమాన్ స్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా హనుమద్ వ్రతం నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి గజమాల, వెండి కవచాలు, వడమాల, తమలపాకులతో అలంకరించారు. స్వామివారి ఉత్సవ మూర్తికి భక్తులు స్వయంగా పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు.

వెల్లాల పుణ్యక్షేత్రంలో..

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వామి ఆలయాల్లో శుక్రవారం హనుమద్ వ్రతాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయాల్లోని ధ్యాన మందిరంలో సీతారామలక్ష్మణ సంజీవరాయ స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలను వేద పండితులు చేశారు. సాయంత్రం ఒంటె వాహనంపై సంజీవరాయ స్వామి గ్రామోత్సవాన్ని మేళతాళాల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగించారు. దంత వైద్య నిపుణులు భరత్ రెడ్డి, చెన్నూరు వీరేంద్ర, బ్రహ్మ, తేజ, సుబ్బలక్షుమ్మల దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపాయపల్లె లక్ష్మీనారాయణ రెడ్డి, సుబ్బిరెడ్డి, దేవస్థానముల మాజీ చైర్మన్లు విజయలక్ష్మి, రామసుబ్బా రెడ్డి, భూపాల్ రెడ్డి, డీపీఆర్ ప్రసాద్ రెడ్డి, బలరామి రెడ్డి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ప్రొద్దుటూరు : అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అభివృద్ధి పనులపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన ఐదు మురుగు నీటి కాలువలకు సంబంధించిన అభివృద్ధి పనులపై డీపీఆర్ తయారు చేయించాలని సూచించారు.

ప్రొద్దుటూరు రూరల్ : ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రతి భూ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం తహసీల్దార్ గంగయ్య అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

పాత్రికేయులపై దాడి హేయమైన చర్య


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

ఖాజీపేట : వేముల తహసీల్దారు కార్యాలయం వద్ద వార్తను చిత్రీకరించడానికి వెళ్లిన సాక్షి టీవీ జర్నలిస్ట్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, పత్రికా విలేకరి రాజారెడ్డిలపై దాడి చేయడం హేయమైన చర్య అని ఏపీఎస్ ఆర్టీసీ కడప మాజీ రీజనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

వేముల తహసీల్దార్ కార్యాలయం వద్ద మీడియా ప్రతినిధులపై దాడిని అధికార భాషా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ తావ్వ వెంకటయ్య ఖండించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని యోగివేమనా యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ మూలె మల్లికార్జునరెడ్డి డిమాండ్ చేశారు. పాత్రికేయులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి కోరారు.

చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : వేముల తహసీల్దారు కార్యాలయం వద్ద సాక్షి టీవీ జర్నలిస్ట్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, పత్రికా విలేకరి రాజారెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ గంగయ్యకు ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని పాత్రికేయులకు రక్షణ కల్పించి, ఇలాంటి సంఘటనలకు పాల్పడ్డ వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

బద్వేలుఅర్బన్ : వేముల తహసీల్దారు కార్యాలయం వద్ద మీడియా ప్రతినిధులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మీడియాపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.